క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువత

గూడూరురూరల్: పట్టణంలోని న్యూబాలాజీ నగర్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్, న్యూ బాలాజీ నగర్ యూత్ ఆధ్వర్యంలో నోవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరంలో న్యూబాలజీ నగర్ యువత, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని 50 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. నోవా బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ మోపూరు భాస్కర్ నాయుడు, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, డాక్టర్ సుగుణమ్మ, క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, కార్యదర్శి కె.శివయ్య, జిల్లా చైర్మన్ లయన్ బి.శీనయ్య, జగదీష్‌చంద్ర, ట్రెజరర్ వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేట 1, 2వ వార్డుల్లో నేడు బుధవారం ఉదయం 6.30 గంటలకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలు, అధికారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉపాధి కూలీ మృతి

పెళ్లకూరు: కానూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ శ్రీపతి మాతయ్య(70) మంగళవారం ఉపాధి పనులు చేస్తూ మృతిచెందాడు. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన మాతయ్య ఉపాధి పనులు చేయడానికి వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ ముందుకు ఒరిగిపోయాడు. వెంటనే అతన్ని నాయుడుపేటలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మాతయ్య మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నాగమ్మ, కుమారుడు ఉన్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏపీఓ దయానంద్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

లారీలో మంటలు

నాయుడుపేటటౌన్: కంకర లోడుతో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నాయుడుపేట పట్టణ పరిధిలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. కుప్పం నుంచి ఒడిశాకు కంకర లోడుతో వెళ్తున్న ఓ లారీ నాయుడుపేట పట్టణం సమీపంలోకి రాగానే బ్యాటరీ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. క్యాబిన్ వరకు మంటలు రావడంతో గమనించిన లారీ డ్రైవర్ లారీకి సంబంధించిన పత్రాలను తీసుకుని బయటకు దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సిబ్బందితో సంఘటనా స్థలం వద్దకు చేరుకుని లారీ నుంచి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేశారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరిరూరల్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎల్‌డీఎం సుభాష్ పేర్కొన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌లేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టీఈఏ నాన్ రిజర్వుడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు సహకారంతో లాలాపేట పంచాయతీలో గ్రామస్తులకు రుణాలపై అవగాహన కల్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్షపై కొమ్మిపాడులో వలంటీర్‌తో కలిసి వైద్యసిబ్బంది సర్వే చేశారు. డాక్టర్ శ్రావణి, ఏఓ పురుషోత్తం శివకుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో రికార్డింగ్ డాన్స్

పెళ్లకూరు: మోదుగులపాళెంలో సోమవారం రాత్రి చవితి వేడుకల్లో రికార్డింగ్ డాన్స్ నిర్వహించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ మంగళవారం తెల్లవారుజామున సంఘటన స్థలానికి చేరుకుని డాన్సర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన డాన్సర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కును అందజేస్తున్న మల్లికార్జున్

వెంకటగిరిరూరల్: సోమసానిగుంట పంచాయతీ ధర్మచాట్ల వారి కండ్రిగ గ్రామానికి చెందిన శనగ రాములమ్మ కుటుంబానికి గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంచుమల్లికార్జున్ ఐటీడీఏ ద్వారా రూ.10వేల చెక్కును మంగళవారం అందజేశారు. అదేగ్రామానికి చెందిన శనగ రాములమ్మ కుమార్తె అరుణ(17) మృతిచెందింది. దీంతో ఐటీడీఏ ద్వారా రాములమ్మ కుటుంబానికి రూ.10వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీఓ శ్రీనివాసులరావు పాల్గొన్నారు.


గూడూరు: జీడిపప్పు వినాయకుడు


నెమలి వినాయకస్వామి


రాపూరులో అన్నదానం

విఘ్నాలు తొలగించు గణనాథా..


నాయుడుపేట: గడియారం సెంటర్ వద్ద ఉట్టి కొడుతున్న యువత

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా వెలిసిన గణపయ్యలు

గూడూరురూరల్: పట్టణంలో వినాయక చవితి వేడుకలు సోమవారం, మంగళవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని వివిధ కూడళ్లలో యువత ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: వెంకటగిరిలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పాత శివాలయం వద్ద చంద్రయాన్-3 చంద్రమండలంలో వినాయస్వామి ఉన్నట్లు ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం పలుచోట్ల స్వామి వారి నిమజ్జనం కోలాహలంగా జరిగింది.

చిల్లకూరులో..

చిల్లకూరు: ఏరూరు, చింతవరం గ్రామాల్లో, తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు.

నిమజ్జనాలతో కిక్కిరిసిన తూపిలిపాళెం

వాకాడు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుని విగ్రహాలను మంగళవారం మండలంలోని తూపిలిపాళెం బీచ్‌లో నిమజ్జనం చేశారు. 148 విగ్రహాలతోపాటు, 20 వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. వాకాడు సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ రఘునాథ ఆధ్వర్యంలో పోలీసులు భక్తులకు భద్రత ఏర్పాటు చేశారు.

సైదాపురంలో

సైదాపురం: మండలంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నాయుడుపేటటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వాడవాడలా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి వేడుకలను జరుపుకున్నారు. ఉట్టిమాను, ఉట్టి కొట్టే ఉత్సవాలను సందడిగా జరుపుకున్నారు. అన్నదాన కార్యక్రమాలను చేశారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో యువకులు వినాయకుడు విగ్రహాలను వాహనాల్లో భారీఎత్తున ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేసి చెరువుల్లో, సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉట్టి కార్యక్రమాల్లో యువకులు కేరింతలు కొట్టారు. వినాయకుని విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు.

పెళ్లకూరులో..


దొరవారిసత్రం: తనియాలిలో వినాయకుడి ఊరేగింపు


ఓజిలిలో వినాయకుడి గ్రామోత్సవం

పెళ్లకూరు: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు.


వెంకటగిరి: చంద్రయాన్-3 వినాయకస్వామి


విగ్రహ నిమజ్జనం



ఊటుకూరులో గణపయ్య, నాయుడుపేటలో వినాయకుడు

ప్రతి గడపలో సంతోషం

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని లింగసముద్రం దళితవాడలు, ఎస్టీ కాలనీలు, ఎగువ లింగసముద్రం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు వివిధ సమస్యలను నేదురుమల్లి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ జి రాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ జీ చంద్రశేఖర్‌రెడ్డి, పి.దశరథరామిరెడ్డి, పి.జగన్‌మోహన్‌రెడ్డి, డి. రవీంద్రారెడ్డి, ఎం నారాయణరెడ్డి, వేముల మల్లికార్జున, రమణయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఎన్ కోటేశ్వరరావు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, బి.భాస్కర్ నాయుడు, జి శ్రీనివాసులునాయుడు, వి. వెంకటాద్రి, కె. వేణుగోపాల్ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి

నేడు గడప గడపకు..

దిగువలింగసముద్రం, నాయుడుపాళెం, చాకలపల్లి గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు.

సూళ్లూరుపేట ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండల ఈఓపీఆర్డీగా బి.శ్రీనివాసులు రావు బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ సూళ్లూరుపేటకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ ప్రమీలారాణిని కలిసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డక్కిలిలో క్రీడా పోటీలు

డక్కిలి: మండల కేంద్రంలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజులు అండర్ 14, అండర్ 17 విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో తొమ్మిది రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కే వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. స్వాతి నక్షత్రం కావడంతో ఈ నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం అయినందున స్వామివారి మూలమూర్తిని చందనంతో అలంకరించారు. సాయంత్రం స్వామివారు బంగారు గరుడ వాహనంపై విహరించారు.


గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

యువకుడిపై దాడి

కోట: చిట్టేడు మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి మద్దాలికి చెందిన రత్నయ్య అనే యువకుడిపై దాడి జరిగింది. కేసవరానికి చెందిన నలుగురు వ్యక్తులు మద్యానికి డబ్బులు కావాలని అడగ్గా రత్నయ్య నిరాకరించడంతో బీరు బాటిల్‌తో అతినిపై దాడి చేసి అతని వద్ద ఉన్న డబ్బులు లాక్కున్నారు. రత్నయ్య తలకు తీవ్రగాయం కావడంతో అతన్ని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు.

శోభాయమానంగా పోలేరమ్మ జాతర

- రాష్ట్ర పండుగ హోదాలో మొదటి సారి జాతర నిర్వహణ

వెంకటగిరిరూరల్: భక్తుల కొంగు బంగారం, వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఈ ఏడాది మరింత శోభాయమానంగా జరగనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది అక్టోబర్ 4, 5 తేదీల్లో జాతర రాష్ట్ర పండుగ హోదాలో మొదటిసారి జరగనుంది. వెంకటగిరి పోలేరమ్మ జాతర దశాబ్దాల చరిత్ర కలిగి ఉంది. వెంకటగిరి సంస్థాన రాజులు ఏలుతున్న రోజుల్లో 1917 సంవత్సరంలో కలరా మహమ్మారి వందలాది మందిని బలితీసుకుంది. ప్రజలను కాపాడే ఉద్దేశంతో వెంకటగిరి సంస్థాన దీసులు శీతల యాగం నిర్వహించి వెంకటగిరి పొలిమేరలో గ్రామశిలలను ఏర్పాటు చేసి అమ్మవారి జాతరకు శ్రీకారం చుట్టారు. వినాయకచవితి అనంతరం వచ్చే మొదటి బుధవారం వెంకటగిరి రాజాల అనుమతితో రాజా ప్యాలెస్‌లో తాంబూలం అనుమతులు తీసుకుంటారు. అనంతరం ఆ రోజు అర్ధరాత్రి కాంపాళెం గాలిగంగుల నుంచి మొదటి చాటింపు వేసి జాతర ప్రారంభవుతుంది. బుధవారం రెండో చాటింపు, వచ్చే ఆదివారం ఘటోత్సవం, మూడో బుధ అమ్మవారి నిలుపు గురువారం అమ్మవారి ఆలయం నుంచి విరూప మండపం వద్ద వరకు అశేష భక్త జనుల మధ్య అమ్మవారి గ్రామోత్సవ అనంతరం విరూపం జరిగి జాతర ముగుస్తుంది. నాటి నుంచి ప్రతి సంవత్సరం అమ్మవారి జాతర అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ గతంలో కంటే మిన్నగా జరుగుతుంది.



జాతరకు ఏళ్ల చరిత్ర...

పోలేరమ్మ జాతరకు వందల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. అమ్మవారి జాతర రాజాల హయాంలో 1917 సంవత్సరం నుంచి 1992వ సంవత్సరం వరకు వెంకటగిరి రాజాల ఆధీనంలో అమ్మవారి జాతర నిర్వహిస్తుండేవారు. 1992వ సంవత్సరంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకున్నారు. నేడు ఆయన తనయుడు, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అమ్మవారి జాతరను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర పండుగగా గుర్తించి జీఓ విడుదలకు ముఖ్య కారకుడయ్యారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఇటీవల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశంలో జాతరపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

గూడూరురూరల్: పోషకాహారంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని గూడూరు ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబి అన్నారు. చెంబడిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. సూపర్‌వైజర్ బి.హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, మస్తానమ్మ, పార్వతి, నారాయణమ్మ, ఇందిరమ్మ, ఎంఎస్‌కే స్వర్ణ పాల్గొన్నారు.

త్వరలో రీ సర్వే

చిల్లకూరు: జగనన్న భూహక్కు, భూరక్ష కింద చేపడుతున్న రీ సర్వే పనులను త్వరలోనే ఆరు గ్రామాలలో చేపట్టనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడారు.

ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక కలయిక


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


విమానాశ్రయంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డితో ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి దంపతులు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్, వెంకటగిరి రూరల్, నాయుడుపేటటౌన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తిరుపతిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా పద్మావతి అతిథిగృహంలో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, ఆయన సతీమణి టీటీడీ మెడికల్ అడ్వైజర్ డాక్టర్ శ్వేత రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయం వద్ద సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కలిశారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


గూడూరులో పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్‌చేసి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు తినిపిస్తున్న పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు

గూడూరు రూరల్: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు 72వ జన్మదిన వేడుకలు సోమవారం గూడూరు సొసైటీ ప్రాంతంలోని ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్‌చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్‌రెడ్డి, సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అదేవిధంగా షాదీమంజిల్‌లో మైనార్టీ నేత గఫూర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌లను కట్‌చేసి పేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వినీష్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా వృద్ధులకు అన్నదానం చేశారు. మండలంలోని చెమిర్తి కూడలి వద్ద సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు యద్దల నరేంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాశిన నాగులు, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సునీల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ఎంపీపీ బి. గురవయ్య, జెడ్పీటీసీ సభ్యులు ఎం. శీనయ్య, వెంకటయ్య, వైస్ ఎంపీపీ ఎం.శ్రీనివాసులురెడ్డి, అట్రాసిటీ కమిటీ సభ్యులు ఎస్.వి.రమణయ్య, కూరపాటి రవీంద్రబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పనులు సక్రమంగా చేయని వారిపై వేటు


ప్రజావేదికలో అధికారుల తీరుపై మండిపడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

- ఉపాధి హామీ పనుల్లో వెలుగు చూసిన అక్రమాలు
- రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ ఆగ్రహం

దొరవారిసత్రం: 'ఉపాధిహామీ పనులు క్షేత్రస్థాయిలో సక్రమంగా చేయలేదు.. దీనికితోడు రికార్డుల నిర్వహణ బాగాలేదు.. అధికారుల పర్యవేక్షణ కొరవడింది.. ఉపాధి హామీ పనులను ఎఫ్‌ఏలు ఇష్టారాజ్యంగా చేశారు' అంటూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ మండిపడ్డారు. దొరవారిసత్రం మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 2022–23 ఏడాదికి సంబంధించి రూ.8.64 కోట్లతో చేపట్టిన 853 పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈసందర్భంగా 22 పంచాయతీల్లో జరిగిన పనుల వివరాలను సామాజిక తనిఖీ సిబ్బంది వివరాలు వెల్లడించారు. ఇందులో ఆనేపూడి, నెల్లూరుపల్లి, నేలపట్టు, పోలిరెడ్డిపాళెం, బూదూరు పంచాయతీల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా చేపట్టిన కాలువ పనుల్లో కొలతలు కానీ, క్షేత్రస్థాయిలో పనులు కానీ బాగాలేవనే విషయాన్ని సిబ్బంది గుర్తించినట్లు పీడీ తెలిపారు. అంతేగాకుండా రికార్డుల నిర్వహణ, జాబ్‌కార్డులో పేరు నమోదు విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత ఈసీలు, టీఏలపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రూ.2 లక్షలు వరకు ఎఫ్‌ఏలు, ఉపాధి సిబ్బంది నుంచి రికవరీ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. అదేవిధంగా ఎఫ్‌ఏలను తొలగిస్తామన్నారు. సమావేశంలో అంబుడ్స్‌మన్ రసరామనాయుడు, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, సర్పంచ్‌లు ప్రసాద్‌నాయుడు, మురళీకృష్ణారెడ్డి, ఏపీఓ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

నాయుడుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ఓజిలి మండలం, బట్లకనుపూరు గ్రామానికి చెందిన యనమల గురవయ్య కుమారుడు హరిష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం ఇంటి వద్దే వర్క్‌ఫ్రం హోం నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం హరిష్ బైక్ తీసుకుని ఇంటి నుంచి నాయుడుపేటకు బయలు దేరాడు. అదేసమయంలో అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్ అవతలి వైపు వస్తున్న స్కార్పియో మొదట డివైడర్‌ను.. ఆ తర్వాత హరీష్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హరిష్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్కార్పియోలో ఉన్న ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. స్కార్పియో డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. సీఐ నరసింహారావు, ఎస్‌ఐ కృష్ణయ్య తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. హరిష్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.


జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన కారు, బైక్ (ఇన్‌సెట్) యలమల హరిష్ (ఫైల్)